పురాతన నాణేల కేసులో పురోగతి

- ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు
- 21 సవర్ల బంగారు నగలు, రూ.4 లక్షల స్వాధీనం
- రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి వెల్లడి


మాట్లాడుతున్న డీఎస్పీ వీరాంజనేయరెడ్డి

పొదలకూరు: పురాతన బంగారు నాణేలను కరిగించి విక్రయించిన ఘటనపై ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి తెలిపారు. పొదలకూరుకు సమీపంలో చిట్టేపల్లి ఎస్సీకాలనీ దగ్గర అంకమ్మతిప్పపై మే 7వ తేదీన లభ్యమైన పురాతన బంగారు నాణేల విక్రయానికి సంబంధించిన కేసు వివరాలను డీఎస్పీ శుక్రవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో వెల్లడించారు. తిప్పపైకి కుందేళ్లు పడుతున్న గిరిజనులతోపాటు వరుణ్ అతడి స్నేహితులు అజిత్, వెంకటేశ్వర్లు వెళ్లారు. ముగ్గురు రాజులకాలం నాటి బంగారు వర్ణంలో ఉన్న చెంబును గుర్తించారు. వారు వెళ్లి కాలనీలోని అమరన్‌కు చెప్పారు. అతను అందులో ఉన్న నాణేలను తీసుకున్నాడు. ఈ విషయాన్ని వరుణ్ బీటెక్ చదువుతున్న తన సోదరి భానుశ్రీకి చెప్పాడు. ఆమె పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. ఇది సోషల్ మీడియాలో వైరలైంది. పోలీసులు జోక్యం చేసుకుని విచారణ నిర్వహించారు. నిజాలు నిగ్గుతేల్చి వెంకటేశ్వర్లు, అమరన్, అజిత్‌పై కేసు నమోదు చేశారు. వారి నుంచి 21 సవర్ల బంగారు నగలు, రూ.4 లక్షల నగదు, కారు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. చెంబులో మొత్తం 770 గ్రాముల వరకు బంగారు నాణేలు, బంగారం ఉండగా 490 గ్రాముల నాణేలను నిందితులు కరిగించి బంగారు నగలు చేయించుకోవడంతోపాటు, నగదుగా మార్చుకుని గ్రామంలో అప్పులు, పొదుపు గ్రూపు కింద ఉన్న రుణాలను చెల్లించారు. చెరువులో పడేసిన చెంబును పోలీసుల ఆధ్వర్యంలో గాలిస్తున్నారు. నిధి నిక్షేపాలు, పురాతన నాణేలు, బంగారు ఆభరణాలు లభ్యమైతే వెంటనే ప్రభుత్వానికి అప్పగించాలని డీఎస్పీ వెల్లడించారు. సమావేశంలో సీఐ జి.సంగమేశ్వరరావు, ఎస్సై ఎస్‌కే కరిముల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

భర్త వేధింపులపై ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్

- స్పందించిన పోలీసులు

నెల్లూరు(క్రైమ్): వారిద్దరు ఉన్నతోద్యోగులు. అయితే విభేదాలు చోటుచేసుకున్నాయి. దీంతో భర్త తనను వేధిస్తున్నాడంటూ భార్య ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టడంతో పోలీసులు స్పందించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. వివరాలిలా ఉన్నాయి. జీవీఆర్‌ఆర్ కళాశాల సమీపంలో దంపతులు తమ కుమార్తెతో కలిసి నివాసం ఉంటున్నారు. భర్త పశుసంవర్ధక శాఖలో, భార్య వ్యవసాయ శాఖలో ఉద్యోగాలు చేస్తున్నారు. వారి మధ్య కొంతకాలంగా విభేదాలున్నాయి. తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో భర్త వేధిస్తున్నాడంటూ భార్య శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టారు. దీనిపై స్పందించిన వేదాయపాళెం పోలీసులు దంపతుల ఇంటికి చేరుకుని మాట్లాడారు. తర్వాత పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

మనస్పర్థలతో దంపతుల ఆత్మహత్య

- అనాథగా మిగిలిన నాలుగేళ్ల కుమార్తె


సుప్రియ మృతదేహం

నెల్లూరు(క్రైమ్): మనస్పర్థలతో దంపతులు ఆత్మహత్య చేసుకోగా.. నాలుగేళ్ల కుమార్తె అనాథగా మిగిలిన విషాద ఘటన ఇది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరులోని కొండాయపాళెం అనగుంటలో ప్రసన్నాంజనేయులు (30), సుప్రియ (24) దంపతులు ఉంటున్నారు. వారు ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. కుమార్తె మహిత ఉంది. ప్రసన్నాంజనేయులు బేల్దారి పనులు చేసేవాడు. భర్త వేరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని భార్యకు తెలిసి వారి మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. తరచూ ఇద్దరూ గొడవపడేవారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి సుప్రియ హెయిల్ ఆయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన భర్త ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తీసుకెళ్లాడు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి ప్రమాదకరంగా ఉందని, అబ్జర్వేషన్‌లో ఉంచాలని వైద్యులు తెలిపారు. కానీ ప్రసన్నాంజనేయులు వారి మాటలను పెడచెవిన పెట్టి భార్యను ఇంటికి తీసుకొచ్చేశాడు. కొన్ని గంటలు గడిచిన తర్వాత ఆమె పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో తిరిగి హాస్పిటల్లో చేర్పించగా శుక్రవారం తెల్లవారుజామున ఆమె మృతిచెందింది. సుప్రియ మృతికి ఆమె భర్త, అత్తలే కారణమని పూర్తిస్థాయిలో విచారించి తగిన చర్యలు తీసుకోవాలని మృతురాలి తల్లిదండ్రులు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం మార్చురీకి తరలించారు.

రైలు కిందపడి..

ఎక్కడ తాను ఇబ్బంది పడతాననో? లేక భార్య మృతిని జీర్ణించుకోలేకనో స్పష్టమైన కారణం తెలియదు కానీ ప్రసన్నాంజనేయులు శుక్రవారం తెల్లవారుజామున పెన్నా బ్రిడ్జి సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్సై డి.హరిచందన ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కారణాలు ఏవైనా తల్లిదండ్రులు ఇద్దరూ బలవన్మరణం చెందడంతో చిన్నారి అనాథ అయింది.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.55
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.10



పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 133
లేయర్ (లైవ్)	: 105
బ్రాయిలర్ చికెన్	: 230
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 256
లేయర్ చికెన్	: 178



సెల్‌ఫోన్ దొంగతనానికి వెళ్లి హత్య

- వాచ్‌మన్ హత్య కేసులో నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ బాజీ

నెల్లూరు(క్రైమ్): వాచ్‌మన్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. శుక్రవారం నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ఎం.బాజీ వివరాలను వెల్లడించారు. ఎం.సుబ్రహ్మణ్యం (43)ది రంగనాయకులపేట. రైల్వేస్టేషన్ తూర్పు ప్రధాన ద్వారం సమీపంలో జరుగుతున్న భవన నిర్మాణాల వద్ద వాచ్‌మన్‌గా ఉండేవాడు. గతనెల 24వ తేదీ రాత్రి ఆయన విధుల్లో ఉండగా దారుణ హత్యకు గురయ్యాడు. మృతుడి కుమారుడు దివాకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. బాజీ ఆధ్వర్యంలో ఎస్సైలు తమ సిబ్బందితో కలిసి సాంకేతికత ఆధారంగా నిందితుడు పప్పులవీధి సత్రం స్కూల్ సమీపంలో నివాసం ఉంటున్న రాధాకృష్ణ అలియాస్ తక్కారిగా గుర్తించి గాలింపు చర్యలు చేపట్టారు. ఈనెల 24వ తేదీ పాత చెక్‌పోస్ట్ సమీప రైల్వేగేట్ వద్ద అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు.

నిద్ర పోతుండగా..

రాధాకృష్ణ రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల సెల్‌ఫోన్లను చోరీ చేసి వాటిని అమ్మగా వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసేవాడు. గతనెల 24వ తేదీ రాత్రి నిందితుడు సెల్‌ఫోన్లను అపహరించేందుకు రైల్వేస్టేషన్‌కు వెళ్లాడు. స్టేషన్ ప్రాంగణంలో తిరుగుతుండగా వాచ్‌మన్ తన ఫోన్‌లో పాటలు వింటూ కునుకు తీయడాన్ని గుర్తించాడు. ఆ ఫోన్‌ను దొంగలించే క్రమంలో నిద్ర నుంచి మేల్కొన్న వాచ్‌మెన్ ప్రతిఘటించాడు. ఇద్దరి మధ్య పెనుగులాట జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన రాధాకృష్ణ పక్కనే ఉన్న రాయితో సుబ్రహ్మణ్యంపై విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేశాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. హత్య కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసిన ఇన్‌స్పెక్టర్, ఎస్సైలు శివప్రకాష్, రెహ్మాన్, సిబ్బంది జి.వెంకటేశ్వర్లు, ఎస్.సురేంద్రబాబు, రత్నం, మోహన్, వేణును డీఎస్పీ అభినందించారు.

పెళ్లికి వెళ్లొస్తుండగా రోడ్డు ప్రమాదం

- ఎనిమిది మందికి గాయాలు
- క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి కాకాణి


బాధితురాలిని పరామర్శిస్తున్న మంత్రి కాకాణి

మనుబోలు: రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన మనుబోలు మండల పరిధిలోని వడ్లపూడి నుంచి చెరుకుమూడి వెళ్లే మార్గంలో శుక్రవారం జరిగింది. బాధితుల కథనం మేరకు.. మనుబోలు మండలం చెరుకుమూడి దళితవాడకు చెందిన బొడ్డు ఢిల్లీబాబు కుమార్తెకు పొదలకూరు మండలం తోడేరు పంచాయతీ రత్నగిరి గ్రామానికి చెందిన అబ్బాయితో శుక్రవారం ఉదయం వివాహం జరిగింది. దీనికి ట్రాక్టర్‌లో వెళ్లిన వధువు తరఫు బంధువులు తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ట్రాక్టర్ ట్రక్‌లో కూర్చొన్న బొడ్డు మోహన్, అతని భార్య మమత, వారి బంధువులు లక్ష్మీదేవి, నందిని, ఏడుకొండలు, మాధవి, బొడ్డు మధు, బొడ్డు సంధ్య తదితరులు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మనుబోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి : కాకాణి

నెల్లూరు(బారకాసు): ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడిన బాధితులందరికీ మెరుగైన వైద్య సేవలందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వైద్యాధికారులను ఆదేశించారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే మంత్రి నెల్లూరులోని జీజీహెచ్‌కు చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలందించి, క్షేమంగా వారి గ్రామానికి చేర్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు చెప్పారు. చిన్నపాటి శస్త్రచికిత్సలు అవసరమైన వారికి చేసేందుకు వైద్యులు సిద్ధంగా ఉన్నారన్నారు. మంత్రి వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, ఆర్డీఓ మలోల, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ కో–ఆర్డినేటర్ లక్ష్మీసునంద ఉన్నారు.


చికిత్స పొందుతున్న మహిళ

మహిళ వైద్యానికి దాతల సాయం

సాక్షి ఎఫెక్ట్..

దుత్తలూరు: మండల కేంద్రమైన దుత్తలూరుకు చెందిన షేక్ షాహినా గుండెజబ్బుతో బాధపడుతుండగా ఆమె వైద్యానికి దాతలు సాయం చేశారు. ఈనెల 23వ తేదీన సాక్షిలో 'పేద కుటుంబానికి పెద్ద కష్టం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో పలువురు స్పందించారు. హైదరాబాద్‌కు చెందిన మాదాల అర్చన రూ.20 వేలు, నర్రవాడకు చెందిన పులివర్తి కొండపనాయుడు రూ.5 వేలు, కామేపల్లికి చెందిన అమీర్‌బాషా రూ.5 వేలు, నర్రవాడకు చెందిన షేక్ బాబు రూ.5 వేలు, వింజమూరుకు చెందిన రంతుల్లా రూ.2 వేలు, ఒంగోలుకు చెందిన నబీ సాహెబ్ రూ.2 వేలు చొప్పున బాధిత మహిళకు ఫోన్ పే ద్వారా సహాయం అందించారు.

ఆటోలో నుంచి పడి బాలుడి మృతి


మృతిచెందిన నందివర్ధన్

సీతారామపురం: మండలంలోని దేవమ్మ చెరువు వద్ద ఓ బాలుడు ఆటోలో నుంచి రోడ్డుపై పడి మృతిచెందిన ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఉదయగిరి మండలం లింగమనేనిపల్లికి చెందిన ఓ కుటుంబం వరలక్ష్మీవ్రతం సందర్భంగా ఆటోలో సిద్ధేశ్వరానికి పూజల నిమిత్తం వచ్చారు. పూజల అనంతరం తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా దేవమ్మ చెరువు వద్ద ప్రమాదవశాత్తు బాలుడు కె.నందివర్ధన్ (6) ఆటోలో నుంచి రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతిచెందాడు. బాలుడు పడిపోతుండగా తల్లి ధనలక్ష్మి, నానమ్మ కొండమ్మ పట్టుకోవడానికి ప్రయత్నించారు. వారు కూడా ఆటోలో నుంచి పడిపోయారు. దీంతో ధనలక్ష్మికి కాలు విరగ్గా, కొండమ్మ చేతులు, ముఖంపై గాయాలయ్యాయి. బాధితులను 108 అంబులెన్స్‌లో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే బాలుడు మృతిచెందడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరుగా రోదిస్తోంది. ఉదయగిరి వైద్యశాలలో మృతదేహాన్ని సీఐ గిరిబాబు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

వివాహ క్యాటరింగ్‌కు వెళ్తూ..

- కొండను ఢీకొన్న ఐషర్ వాహనం
- ఇద్దరు మహిళల దుర్మరణం
- 11 మందికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం


మృతి చెందిన సుజాత


మహిళ మృతదేహం

చిట్వేలి: రైల్వే కోడూరులో జరగనున్న వివాహానికి క్యాటరింగ్ చేసేందుకు నెల్లూరు నుంచి వెస్తూ ఘోర రోడ్డు ప్రమాదానికి గురైన ఘటనలో ఇద్దరు మహిళలు దుర్మరణం చెందగా, 11 మంది గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. చిట్వేలి పరిధిలోని రాపూరు మూడో ఘాట్ మలుపు వద్ద ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నగరం, సమీప ప్రాంతాల్లోని గ్రామాలకు చెందిన 13 మంది వివాహానికి క్యాటరింగ్ చేసేందుకు ఐషర్ వాహనంలో నెల్లూరు నుంచి బయల్దేరారు. వాహనం రాపూరు ఘాట్ రోడ్డు మూడో మలుపు వద్దకు రాగానే.. బ్రేక్ ఫెయిలవడంతో డ్రైవర్ అదుపుచేయలేక కొండను ఢీకొన్నారు. దీంతో వాహనంలో ప్రయాణిస్తున్న నెల్లూరులోని బీవీనగర్‌కు చెందిన సుజాత (52), నెల్లూరుకు చెందిన మరో 37 ఏళ్ల మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో గాయపడిన 11 మందిని రాజంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో నాగమణి, లక్ష్మి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం కడప రిమ్స్ ఆస్పత్రికి 108లో తీసుకెళ్లారు. ప్రమాదంలో ఐషర్ డ్రైవర్ భాస్కర్ గాయాల్లేకుండా బయటపడ్డారు. స్థానికుల సాయంతో క్షతగాత్రులకు పోలీసులు సాయం అందించారు. రాకపోకలను పునరుద్ధరించారు. పోస్ట్ మార్టం నిమిత్తం మృతదేహాలను రాజంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



ఎంపీ ఆదాలను సత్కరిస్తున్న ధనుంజయరెడ్డి

నెల్లూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిశీలకుడిగా నియమితులైన మెట్టుకూరు ధనుంజయరెడ్డి ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఎంపీ నివాసంలో మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. రూరల్ పరిధిలోని రాజకీయ అంశాలపై చర్చించుకున్నారు.

• వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన 18వ డివిజన్‌కు చెందిన వేలూరు శివసునీల్‌కుమార్‌రెడ్డి ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి కృతజ్ఞతలను తెలియజేశారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, పార్టీ రూరల్ పరిశీలకుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి, రామిరెడ్డి, దారా వంశీ పాల్గొన్నారు.

వేమిరెడ్డికి అభినందన



నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రెండోసారి ఎంపిక కావడంపై పార్టీ జిల్లా ట్రెజరర్ కాటంరెడ్డి రవీంద్రరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన కార్యాలయంలో శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. జిల్లా ట్రెజరర్‌గా నియమితులైన కాటంరెడ్డిని వేమిరెడ్డి అభినందించారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, తదితరులకు కృతజ్ఞతలను తెలియజేశారు.

ఆలయాలకు సారె సమర్పణ



నెల్లూరు(బృందావనం): శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కొలువైన 40కిపైగా గ్రామదేవతల ఆలయాలకు సారెను సమర్పించామని కాశీనాయన ఆశ్రమ నిర్వాహకుడు ధన్వి శ్రీనివాస్ పేర్కొన్నారు. వైకుంఠపురంలోని కాశీనాయన ఆశ్రమంలో సారెను పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పసుపు, కుంకుమ, గాజులు, తాంబూలం, చీర, రవికతో కూడిన 18 పవిత్ర ద్రవ్యాలతో సారెను అందజేశామని చెప్పారు. ఆశ్రమ సభ్యులు నాగూర్, రామ్‌ప్రసాద్, సిద్ధయ్య, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వెంకయ్యస్వామి నగరోత్సవం



నెల్లూరు(బృందావనం): నవాబుపేట రైతుబజార్ సమీపంలోని భగవాన్ వెంకయ్యస్వామి మందిరంలో నిర్వహిస్తున్న ఆరాధన మహోత్సవాల్లో భాగంగా నగరోత్సవాన్ని కనులపండువగా జరిపారు. పూర్ణచంద్రశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉభయకర్తలుగా వ్యవస్థాపక ధర్మకర్త రాయపాటి కృష్ణయ్యనాయుడు దంపతులు వ్యవహరించారు.

ప్రభుత్వాస్పత్రిలో అన్నదానం



నెల్లూరు(పొగతోట): నగరంలోని ప్రభుత్వాస్పత్రిలో గల ప్రసూతి, చిన్నపిల్లల వార్డుల్లో అన్నదానాన్ని శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆనం విజయకుమార్‌రెడ్డి, పార్టీ నేత ఆనం జయకుమార్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టారు. రాజేష్‌నాయుడు, ఖాదర్‌బాషా, మాధవ్, నవాబ్‌జాన్, మురళి, ఆరిఫ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీ సెంటర్): నగరంలోని రైతుబజార్ సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని ఏఈ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీపురం, తడికలబజార్, ముకుందపురం, రామచంద్రాపురం, విజయగోపాలపురం, శెట్టిగుంట రోడ్డు, వీవర్స్‌కాలనీ, పప్పులవీధి, వైటీనాయుడు వీధి, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

జగజ్జననీ.. నమోస్తుతే

• భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం

నెల్లూరు(బృందావనం): శ్రావణ మాస రెండో శుక్రవారాన్ని పురస్కరించుకొని నగరంలోని వివిధ ఆలయాల్లో జగజ్జనని విశేషాలంకారాల్లో దర్శనమిచ్చారు. భక్తులు విశేషంగా తరలివచ్చి సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఆచరించారు.

• నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారు వరలక్ష్మిగా దర్శనమిచ్చారు. సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు ఆచరించారు. ఆలయ ప్రధానార్చకుడు సూరావఝుల రఘురామ్మూర్తి, వేదపండితుడు అవ్వారి వెంకటరామకృష్ణశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు పూజా కార్యక్రమాలను జరిపారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

• సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో సామూహిక కుంకుమార్చన, పూలంగిసేవ, చందనాలంకారం, పల్లకిసేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారు ముత్యాలచీర అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా అనంత మల్లికార్జునశర్మ, శ్రీకాంత్‌శర్మ వ్యవహరించారు. ఈఓ మల్లికార్జునరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

• సుజాతమ్మ కాలనీలోని కృష్ణయోగ మందిర ప్రాంగణంలో గల అష్టలక్ష్మి ఆలయంలో స్వర్ణమహాలక్ష్మి మూలవర్లు, ఉత్సవమూర్తికి అభిషేకాలు, పూజలు చేశారు. సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా అనపల్లి అశోక్‌కుమార్‌రెడ్డి, సులోచనమ్మ దంపతులు వ్యవహరించారు. సర్వేపల్లి అజయ్‌కుమార్ తదితరులు పర్యవేక్షించారు.

• బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో అమ్మవారికి సామూహిక వరలక్ష్మీ వ్రతం, కుంకుమ పూజలను నిర్వహించారు. ఉభయకర్తలుగా ఆదిశేషయ్య, వెంకటసుబ్బమ్మ దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా, సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి తన్నీరు మస్తాన్‌రావు తదితరులు పర్యవేక్షించారు.



సామూహిక వరలక్ష్మీ వ్రతంలో మహిళలు





వైభవలక్ష్మి అమ్మవారికి పూజలు



భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి సన్నిధిలో..



కృష్ణ యోగ మందిరంలో..



వరలక్ష్మిగా రాజరాజేశ్వరి అమ్మవారు

భారం మోపకుండా అభివృద్ధి పనులు

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ప్రజలపై ఎలాంటి భారం మోపకుండా నగరంలో అభివృద్ధి పనులు చేస్తున్నామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. 14వ డివిజన్లోని ఏసీనగర్ మెయిన్ రోడ్డు గిరిజన సంఘం వద్ద రూ.20 లక్షలతో నిర్మించనున్న డ్రెయిన్ల పనులకు శంకుస్థాపనను శుక్రవారం చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. డివిజన్లో మరో రూ.60 లక్షలతో చేపట్టనున్న డ్రెయిన్ల పనులకు టెండర్లను పిలవనున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో డ్రెయిన్ల పనులను పూర్తిగా నిలిపేసి.. ఎన్నికలకు ఆర్నెల్ల ముందు రోడ్లు వేసి అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకొంటున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం ఏర్పడ్డాక ట్రాఫిక్, రోడ్లు, డ్రెయిన్ల సమస్యలను పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. నగర నియోజకవర్గానికి అదనంగా రూ.16 కోట్లను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా తీసుకురానున్నామన్నారు. కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డ్రెయిన్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న అనిల్‌కుమార్

పెండింగ్‌లో ఉన్న సేవలను పూర్తి చేయండి

నెల్లూరు(బారకాసు): సచివాలయాల్లో పెండింగ్‌లో ఉన్న సేవలను గడువులోపు పూర్తి చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. మెడికవర్ ఆస్పత్రి వెనుక వైపున కాలువ సమస్యతో పాటు ధనలక్ష్మీపురం, వావిలేటిపాడు ప్రాంతాలకు సంబంధించి 'జగనన్నకు చెబుదాం', స్పందనలో అందిన ఫిర్యాదులను అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం 17 / 3 ఆకుతోట దళితవాడలోని వార్డు సచివాలయాన్ని తనిఖీ చేశారు. స్థానిక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందిస్తున్న ఉచిత వైద్యం, మందుల పంపిణీ, రక్త పరీక్షలు, తదితర సేవలపై సచివాలయ పరిధిలోని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

నిర్మాణ పనులు వేగవంతం

జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు అదనపు కార్మికులను నియమించి.. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. వెంకటేశ్వరపురంలోని లేఅవుట్‌ను హౌసింగ్ విభాగం, ఎస్పీడీసీఎల్, నగరపాలక సంస్థ అధికారులతో కలిసి పరిశీలించారు.



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

టిడ్కో గృహాలపై సమీక్ష

టిడ్కో ఫ్లాట్లపై సమీక్ష సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో కమిషనర్ నిర్వహించారు. టిడ్కో గృహ లబ్ధిదారులకు రుణాల మంజూరును సులభతరం చేయాలని సూచించారు.

ఘనంగా ఆనం జయకుమార్‌రెడ్డి జన్మదినం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత ఆనం జయకుమార్‌రెడ్డి జన్మదినాన్ని ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సుజాతమ్మ కాలనీలోని ఆయన నివాసంలో కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. యూసఫ్‌ఖాన్, రియాజ్, ఖదీర్, జయ, మహ్మద్, తదితరులు పాల్గొన్నారు.



కుష్టు నియంత్రణకు చర్యలు

నెల్లూరు(బారకాసు): జిల్లాలో కుష్టు నియంత్రణకు చర్యలు చేపట్టాలని జిల్లా ఎయిడ్స్, కుష్టు, క్షయ నియంత్రణాధికారి ఖాదర్‌వలీ పేర్కొన్నారు. నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఏఎల్టీ విభాగానికి చెందిన పలువురు అధికారులతో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో సర్వేను నిర్వహించాలని సూచించారు. తొలుత ఖాదర్‌వలీని పలువురు సత్కరించారు. జిల్లా న్యూక్లియస్ వైద్యాధికారి సురేంద్రబాబు, డీఎఫ్ఐటీ కో ఆర్డినేటర్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.



ఖాదర్‌వలీకి సత్కారం

అన్ని ఆస్పత్రుల్లో ఈహెచ్ఎస్ అమలయ్యేలా చూడరూ..

నెల్లూరు(బారకాసు): అన్ని ఆస్పత్రుల్లో ఈహెచ్ఎస్ / మెడికల్ రీయింబర్స్‌మెంట్ అమలయ్యేలా చూడాలని ఈహెచ్ఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ పెంచలయ్య, డాక్టర్ రమేష్‌నాథ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడారు. అపోలో, కిమ్స్ హాస్పిటళ్లలో ఈహెచ్ఎస్ అమలయ్యేలా చూడటంతో పాటు మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు త్వరగా మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. చెన్నైలోనూ ఈహెచ్ఎస్ అమలయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. వినతులను సీఈఓ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామని ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. జిల్లాలోని 28 ప్రైవేట్ నెట్‌వర్క్, 30 డెంటల్ హాస్పిటళ్లలో ఈహెచ్ఎస్ అందుబాటులో ఉందని తెలిపారు. జీజీహెచ్‌లో ఈహెచ్ఎస్ క్రానిక్ ఓపీ.. కావలి, కందుకూరు ఏరియా హాస్పిటళ్లలో డిస్పెన్సరీ సిస్టమ్‌ను ఏర్పాటు చేశామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



హామీలను నెరవేర్చిన సీఎం జగన్

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. 37, 26వ డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనను శుక్రవారం చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. 37వ డివిజన్లో ఇప్పటికే రూ.2.8 కోట్లతో అభివృద్ధి పనులను పూర్తి చేశామని, ప్రస్తుతం రూ.80 లక్షలతో వివిధ పనులకు శంకుస్థాపన చేశామని వెల్లడించారు. 26వ డివిజన్లో రూ.35 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని, అవసరమైతే మరిన్ని నిధుల మంజూరుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. నియోజకవర్గాన్ని నంబర్ వన్‌గా నిలపాలనేదే తన లక్ష్యమని తెలిపారు. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో చంద్రబాబు విఫలమయ్యారని, ఈసారీ ఆయన్ను ప్రజలు నమ్మబోరని చెప్పారు. పార్టీ రూరల్ నియోజకవర్గ పరిశీలకుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్, చంద్రమౌళి, సుబ్బారెడ్డి, సన్నపురెడ్డి సుబ్బారెడ్డి, సన్నపురెడ్డి పెంచల్‌రెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

వైఎస్సార్సీపీలో సముచిత స్థానం

నెల్లూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానాన్ని కల్పిస్తామని ఎంపీ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ పరిధిలోని 33వ డివిజన్‌కు చెందిన ముజామిల్, జియా మరో 50 మంది పార్టీ డివిజన్ ఇన్‌చార్జి మేఘనాథ్ సింగ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. నగరంలోని తన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరికి పార్టీ కండువాలను కప్పి ఎంపీ సాదరంగా ఆహ్వానించారు. మజహర్, ముజీర్, అహ్మద్, సిరాజుద్దీన్, వసీం, వంశీ, బాలాజీ, మణి పార్టీలో చేరారు.

• వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత సూరిబాబు ఆధ్వర్యంలో యునైటెడ్ గుడ్ న్యూస్ బాప్టిస్ట్ చర్చి సంఘస్తులు పలువురు ఎంపీ సమక్షంలో పార్టీలో చేరారు. ప్రేమరాజు, రమణరావు, జాన్‌వెస్లీ, నరేంద్ర, బాబు, రాజశేఖర్, తదితరులు పార్టీలో చేరారు.



పార్టీలో చేరిన వారితో ఎంపీ ఆదాల

గిరిజనులకు అన్యాయం చేసిన చంద్రబాబు



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(మినీబైపాస్): గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని గిరిజనులకు చంద్రబాబు అన్యాయం చేశారని ఆలిండియా ఎరుకల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు ప్రభాకర్ ఆరోపించారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు ఇట్టా వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలకు అంకురార్పణ



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో నిర్వహించనున్న పవిత్రోత్సవాలకు అంకురార్పణను భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. విశేష పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు, నిశింద సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, ధర్మకర్తల మండలి సభ్యులు నరసింహాచార్యులు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ - 2 పరీక్షలపై అవగాహన రేపు

నెల్లూరు (టౌన్): గ్రూప్ - 2 పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సును మద్రాస్ బస్టాండ్ సమీపంలోని శ్రీహర్ష కోచింగ్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించనున్నామని సెంటర్ డైరెక్టర్ హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ విద్యావేత్త, ఎమ్మెల్సీ లక్ష్మణరావు హాజరుకానున్నారని వెల్లడించారు. సదస్సుకు హాజరైన అభ్యర్థులకు వివిధ అంశాలపై బుక్‌లెట్‌ను అందజేయనున్నామని, వివరాలకు 92470 01115, 93465 57799 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

గాయపడిన వృద్ధురాలి మృతి

నెల్లూరు(క్రైమ్): దీపారాధన చేస్తూ ప్రమాదవశాత్తూ గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు శుక్రవారం మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. ఏసీనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో సుబ్రహ్మణ్యకుమార్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన అత్త కామాక్షమ్మ (65) ఈ నెల 13వ తేదీ ఉదయం ఇంట్లో దీపారాధన చేస్తుండగా ప్రమాదవశాత్తూ నైటీకి నిప్పంటుకొని శరీరం కాలింది. గమనించిన కుటుంబసభ్యులు మంటలను ఆర్పి చికిత్స నిమిత్తం తొలుత నారాయణ హాస్పిటల్‌కు.. మెరుగైన చికిత్స నిమిత్తం చెన్నైలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు ఈ నెల 19న తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. మృతురాలి అల్లుడి ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నరసింహకొండపై విశేష పూజలు

నెల్లూరు రూరల్: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో విశేష పూజలను నిర్వహించారు. ఆదిలక్ష్మి అమ్మవారి సన్నిధిలో పంచామృతాభిషేకాలు, పల్లకిసేవను జరిపారు. ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ పాల్గొన్నారు.

28న న్యాయవాదుల కోర్టు విధుల బహిష్కరణ

నెల్లూరు(లీగల్): విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యుడు, న్యాయవాది ప్రవీణ్‌కుమార్‌పై దాడి ఘటనకు నిరసనగా కోర్టు విధులను న్యాయవాదులు సోమవారం బహిష్కరించనున్నారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుందరయ్య తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో అత్యవసర కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు సహకరించాలని కోరారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం

నెల్లూరు(బృందావనం): పొదలకూరు రోడ్డులోని వియానీ హోమ్‌లో గల దివ్యాంగ బాలికల వసతిగృహంలో రూ.30 వేలతో ఆర్వో ప్లాంట్‌ను రోటరీ క్లబ్, నెల్లూరు ఆధ్వర్యంలో ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షుడు సమీవుల్లా, కార్యదర్శి ఉదయభాస్కర్‌రావు, రాఘవేంద్రశెట్టి, ప్రతాప్‌కుమార్‌రెడ్డి, నరేష్‌చంద్రారెడ్డి, నరసింహారావు, దొరస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారులపై కలెక్టర్ సీరియస్

నెల్లూరు(సెంట్రల్): జిల్లా వ్యవసాయ శాఖ అధికారులపై కలెక్టర్ హరినారాయణన్ సీరియస్ అయ్యారు. పీఎం కిసాన్ నమోదులో ఎందుకు అలసత్వం వహిస్తున్నారని ప్రశ్నించారు. వ్యవసాయాధికారులతో టెలి కాన్ఫరెన్స్‌ను శుక్రవారం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్‌రాజుపై అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలో దాదాపు 20 వేల మంది అనర్హులు పీఎం కిసాన్ నగదును పొందుతున్నారని, వీరిని తొలగించి అర్హులకు న్యాయం చేయాలని సూచిస్తున్నా, ఎందుకు అలసత్వం వహిస్తున్నారని ప్రశ్నించారు. అనర్హులను తొలగించి, ఈ నెల 28లోపు జాబితాను సరిచేయాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

బీపీ మండల్‌కు ఘన నివాళి



నెల్లూరు(వేదాయపాళెం): బీపీ మండల్ సిఫార్సుల అమలుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య కోరారు. అయ్యప్పగుడి సమీపంలోని బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ కార్యాలయంలో బీపీ మండల్ జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి మురళి, లీలాకృష్ణ యాదవ్, అనిల్, వెంకటేశ్వర్లు, మురళి, విజయకుమార్, దయాకర్, చాన్‌బాషా, మోహన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.